# కన్నీటి వర్షం

భాస్కర్‌రెడ్డి స్టాఫ్‌రూమ్‌లో కూర్చుని చిట్‌ఫండ్ పైకం వసూళ్లల్లో నిండా మునిగిపోయి ఉన్నాడు. ఆ చిట్టీ నడపడం వల్ల అతనికి కమీషన్ వస్తుంది. అందరితో పాటు తన రెండు చిట్లకి డివిడెండ్ వస్తుంది. ఆ నెల చిట్టీ పాడుకుంటే తప్ప దిక్కులేదు అన్న ఒత్తిడి ఉన్నవాళ్లకు సహాయపడుతున్నందుకు వారిమీద పెత్తనం, వారి గౌరవం - రెండూ లభిస్తాయి. ఈ చిట్‌ఫండ్ వ్యవహారంలో భాస్కర్‌రెడ్డి ఆ పాఠశాల సిబ్బందికి పెద్దదిక్కు అయినాడు. ఆపదలో ఉన్న చాలమంది ఉపాధ్యాయులకు, సమయానికి ఆదుకున్న ఆప్తుడయినాడు. దాదాపు పదిహేను వందల మంది బాలబాలికలతో కళకళలాడుతున్న ఆ పాఠశాల పాతబస్తీలో ఒక సరస్వతీ మందిరమే. ఉదయం వందేమాతరం మొదలుకొని సాయంత్రం చివరిగంట పడే వరకు పిల్లల కోలాహలంతో, చదువులతో, ఆటలతో, పాటలతో ఆ మందిరంలో పూజలు కొనసాగుతున్నట్టుగానే ఉంటుంది.

రేపు ఆదివారం. ఎల్లుండి ప్రభుత్వ సెలవుదినం. పెళ్లిచూపులు కోసం తల్లిదండ్రులు ఊరికి రమ్మన్నారు. బస్సులో పోతే ఊరు గంట దూరం. బడి విడిచిపెట్టిన వెంటనే బస్‌డిపోకి పోవాలనుకున్నాడు అంజిరెడ్డి. వెళ్లేముందు భాస్కర్‌రెడ్డితో ఒకమాట చెప్పేసి బైటపడదామనుకుంటే చిట్టి పైసలు వసూళ్లలో అతడు ఎవరితోను మాట్లాడేట్టులేడు.

గతనెల కొత్తగా ఉద్యోగంలో చేరిన డ్రాయింగ్‌సార్ సూర్యప్రసాద్, తొలిసారి వేతనం అందుకున్న సంతోషంతో పాఠశాల మొత్తం సిబ్బందికి తేనేటి విందిచ్చాడు. ఆ విందారగించిన తర్వాత ఈ చిట్టి దందాతో సంబంధంలేని టీచర్లు అంతా ఇండ్లకు వెళ్లిపోయినారు. దాంతో ఇప్పుడు స్కూలు మొత్తం నిశ్శబ్దంగా, ప్రశాంతంగా ఉంది.

అయితే అక్కడ అప్పులు వసూలు చేసుకోవడానికి వచ్చిన వడ్డీ వ్యాపారులు, వాయిదా చెల్లింపుల పద్ధతి వ్యాపారులు కొత్త కొత్త ముఖాల వాళ్లు ఆరేడుగురు, తమకి బాకీపడ్డ టీచర్లు తప్పించుకుని పారిపోకుండా కాపలా కాస్తున్నారు.

ఇప్పుడు చిట్టి పాట పదినిమిషాల్లో ప్రారంభమవుతుంది. ఆ చిట్టి దందాలో ఉన్నవాళ్లు మాత్రమే ఆ స్టాఫ్‌రూమ్‌లో చేరారు.

అంతా సవ్యంగా సాగిపోతున్న సమయంలో ఒక్కసారి పెద్ద పెద్ద అరుపులు...

భాస్కర్‌రెడ్డి గొంతు చించుకొని ఒర్లుతున్నాడు. ఎవరిని ఉద్దేశించి ఒర్లుతున్నాడో ముందు ఎవరికీ అర్థం కాలేదు. అక్కడ పోగయిన సార్లు అంతా భాస్కర్‌రెడ్డిని శాంతింపజేస్తున్నారు. అతనికి కోపం వస్తే పెద్ద ముప్పే రావచ్చునన్న భయం వాళ్ల ముఖాల్లో కన్పిస్తున్నది.

'అది కాదుర భయి, కిందటి నెల నేను ఎత్తుకున్నానా చిట్టి? దాంట్ల రెండు వేల రూపాయలు తర్వాత ఇస్తానని పట్టుకున్నాడా? ఈ సారి అది సదురుకో అంటే కాదంటడు. అది బాకీ ఉంచుతాడంట... ఈ నెల నేనిచ్చు కోవాలంట... పైసలు అవసరం ఉండి కదా నేను పోటీపడి నష్టానికి చిట్టి పాడింది. ఇదేం దందరా భయి' అని అంజిరెడ్డి ఫిర్యాదు.

కథ అక్కడున్న వాళ్లందరికే అర్థమయింది.

భాస్కర్‌రెడ్డి ఆ స్కూల్‌లో ఒక బ్యాంక్. అక్కడ పన్జేస్తున్న దాదాపు డెబ్బయిమంది ఉపాధ్యాయులు, ఉపాధ్యాయేతర సిబ్బందీ భాస్కర్‌రెడ్డితో స్నేహంగా, వినయవిధేయతలతో, కొన్నిసార్లు కృతజ్ఞతా భావంతో, కొందరయితే భయభక్తులతో బతుకుతున్నారు. అన్నా అన్నా అని భాస్కర్‌రెడ్డి చుట్టూ తిరుగుతూ, అతడి మీద ఈగనన్నా వాలనివ్వరు వాళ్లు. మరి కొందరు సార్లయితే భాస్కర్‌రెడ్డి అండతోనే తమతమ సంసారాలు నెట్టుకొస్తున్నారు. అవసరానికి ఆదుకునే ఆప్తుడు అని మెచ్చు కుంటారు. అతడే లేకపోతే తమ బతుకులు ఏమయ్యేవో ఊహించుకోలేరు వాళ్లు. అట్లాంటి పరిస్థితిలో భాస్కర్‌రెడ్డి మాటకి ఎదురు చెప్తున్న అంజిరెడ్డిని చూస్తుంటే చిత్రంగానే కన్పిస్తున్నది వాళ్లకి.

తనను శాంతింప జేస్తున్న సార్లను చీల్చుకుని, ముందుకు వచ్చి, అంజిరెడ్డి ముఖంలో ముఖం పెట్టి, తన కండ్లద్దాల కండ్లతో నిప్పులు కక్కుతున్నట్టు అంజిరెడ్డిని చూస్తూ, 'నేను కాదన్నాన... నేను కాదన్నాన... చెప్పు... ఆ పైసలు తర్వాత అడ్జెస్ట్ చేస్తనన్న... ఇప్పుడిది ఇవ్వు అన్న... నీ దిమాఖగని ఖరాభయిందా? సోంచాయించవెందుకని...'

భాస్కర్‌రెడ్డి గొంతు తగ్గించి నెమ్మదిగా, కరుగ్గా చెప్తున్నాడు. నచ్చ చెప్తున్నట్టే ఉన్నా ఆ మాటలు కుక్క బొక్కని నములుతున్నట్టుగా ఉన్నాయి.

చెట్ల నీడవలన ఆ గదిలో వెలుతురు తక్కువగానే ఉంది. దాంట్లో చిట్టి దందాతో సంబంధం ఉన్నవాళ్లంతా చేరడంతో ఇరుగ్గా కూడా ఉంది.

భాస్కర్రెడ్డి మాటలు అర్థమై నలుగురయిదుగురు సార్లు అంజిరెడ్డి చుట్టూ చేరి, 'ఆ పైసలు ఇచ్చేయిరాదుర భయి... తర్వాత సదురుతా నంటున్నాడు కద' అని అతడికి నచ్చ చెప్ప ప్రయత్నిస్తున్నారు.

నిజానికి వాళ్లు ఆ మాటలు భాస్కర్‌రెడ్డికి చెప్పాలె. తనకి కాదు. 'మీరేంది చెప్పేడిది? తెల్వక పోతే ఊకె ఉండరాదు' అని విసుక్కుంటున్నాడు అంజిరెడ్డి.

తన తరఫున ఒక్కరూ మాట్లాడటం లేదు సరి కదా అంతా భాస్కర్‌రెడ్డి కొమ్ముకాస్తున్నారు.

భాస్కర్‌రెడ్డిని ఎదిరించ గలిగిన ధైర్యం అంజిరెడ్డికి ఎక్కణ్నించి వచ్చింది అన్నది వాళ్లకి ఒకంతట అర్థ కావడం లేదు.

ఏళ్ల నిరుద్యోగంతో పస్తుల బతుకు బతికి, ఉద్యోగంలో చేరినప్పటికి బక్కచిక్కి రోగిష్టిలా ఉండే వాడు అంజిరెడ్డి.

ఇంక ఏడాదికూడా నిండలేదు. ఇప్పుడు గొంతు పెగిల్చి భాస్కర్‌రెడ్డిని నిలదీసి అడుగుతున్న వైనం చూసి వాళ్లు విస్తు పోతున్నారు.

ఉద్యోగంలో చేరిన కొత్తలో అంజిరెడ్డి అమాయకంగా ఉండే వాడు. తోటి సీనియర్ ఉపాధ్యాయులపట్ల ప్రేమతో ఉండే వాడు. నోటి నుండి మాట వచ్చేది కాదు. ఇతర సార్లు మాట్లాడుకుంటూ ఉంటే తెల్లబోయి చూసేవాడు. అట్లాంటి వాడు ఇప్పుడు భాస్కర్‌రెడ్డి మీదకి ఎదురు తిరగడం కొందరికి నవ్వు తెప్పించింది.

గండిపేట నీళ్ల మహాత్యం... అనుకున్నారు.

'ఇచ్చేయ రాదురా భయి... ఇచ్చేయి ముందు... తర్వాత ఇస్తానంటున్నాడు కదా... అవలగాడివేం...' అంటున్నారు.

దోషిని చూస్తున్నట్టుగా వాళ్లు అతడిని చూస్తున్నారు.

భాస్కర్‌రెడ్డి కోపంనుండి అతడిని కాపాడాలన్న అభిమానంతోను, తోటివానికి సహాయపడాలన్న జాలితోను, అనవసరంగా గొడవ పెంచుకోవద్దన్న ఉద్దేశ్యముతోను ఆ సార్లు నచ్చచెప్తున్న మాటలు విని, నోటిమాట రాక... ఏం జవాబు చెప్పాలో తోచక, వీళ్లు సార్లు అవునో కాదో అటుంచి వీళ్లు మనుషులు అవునో కాదో అన్న అనుమానంతో అవాక్కయి నుంచుండి పోయాడు అంజిరెడ్డి.

కిందటి నెల చిట్టీ పదిహేను వేల నష్టానికి అంజిరెడ్డి పాడుకున్నాడు. భాస్కర్‌రెడ్డి తన కమిషన్, డివిడెండ్, ఆ నెల చెల్లించాల్సిన చిట్టీ మొత్తం అంతాపోను దాదాపు ఇరవైరెండు వేలు అంజిరెడ్డికి ఇవ్వాలి. దాన్లో ఆ వేళ పద్దెనమిది వేలే ఇచ్చాడు. తర్వాత ఓ వారానికి మరో మూడు వేలు ఇచ్చాడు. ఇంకో రెండు వేలు భాస్కర్రెడ్డి తనకి ఇవ్వాల్సింది ఉంది. ఈ నెల తను చెల్లించాల్సిన పైకం దాంట్లోంచి సదురుకో అంటే ఇప్పుడీ గొడవ. డివిడెండ్ తగ్గించుకొని ఈ నెల షేరు కట్టమని, పాత బాకీ వ్యవహారం తర్వాత మాట్లాడుకుందామని భాస్కర్‌రెడ్డి వాదన.

భాస్కర్‌రెడ్డి చిట్టీ దందాలో పడకురా భయి అని మొదట్లో కొందరు సార్లు హెచ్చరించినప్పుడు, తన అవసరం ఒత్తిడి వల్ల తప్పని సరై చిట్టీలో చేరవలసి వచ్చింది. సిటీలో నిరుద్యోగిగా రెండేళ్లు గడిపినప్పుడు చేసిన అప్పులూ, చేబదుళ్లూ, చివరకు

మిత్తీల్లోకి కూరుకుపోవలసి వచ్చింది. పరువు మర్యాదలు మంటగలిసినా సరే బతకక తప్పదు. ఉద్యోగం అయితే వచ్చింది కదా, రెండుమూడు ఏండ్లలో ఈ అప్పుల నుండి బయటపడవచ్చులే అని ఆశించాడు.

పేంట్ జేబులో పెట్టుకున్న జీతం పైకం తీసి లెక్క పెట్టి తన చిట్టి షేరు కింద కట్టాల్సిన మొత్తం చేతిలో పట్టుకున్నాడు.

కన్నీళ్లు ఉప్పొంగుకొని వచ్చాయి.

రెండు నెలల కిందటే యాదగిరి గుట్టలో తలనీలాలు ఇచ్చుకున్నాడు. చిన్నజుట్టు. ఇంకా పాతికేళ్లు నిండని యౌవనం. గుండ్రటి ముఖం. అందమైన కళ్లు. గోధుమరంగు శరీరఛాయ. అయిదడుగుల ఏడంగుళాల ఎత్తు. రూపసి కిందేలెక్క. అన్నిటికన్న ముఖ్యం విద్యార్థులు అతడిని ప్రేమిస్తారు. విద్యార్థులకు పల్లెల్లో జనం పాడుకునే జానపద గీతాలు... మధ్య మధ్య పాడి వాళ్ల అభిమానం పొందాడు. ఉపాధ్యాయుల్లో చాలా మందికి మల్లె అంజిరెడ్డి కూడా తన వృత్తిపట్ల గౌరవంతో తగినంత శ్రద్ధతో పాఠాలు బోధిస్తాడు. అదొక సద్గుణం అయింది. ఆ రకంగా తోటి ఉపాధ్యాయుల మన్ననలకు పాత్రుడయ్యాడు.

'కొత్త చిట్టి పాట వరకు ఉండి డివిడెండ్ తీసుకొని వెళ్లు' అని భాస్కర్‌రెడ్డి చెప్తున్నా, భాస్కర్‌రెడ్డి చేతిలో పైసలు పెట్టేసి, ఎవ్వరి వేపు తిరిగి చూడకుండా గేటుదాటి వచ్చి రోడ్డు దారి పట్టాడు అంజిరెడ్డి. కన్నీళ్లు కారుతునే ఉన్నాయి.

'ఈ లంగ గాడిదకొడుకులకు ఇజ్జత్ కూడా ఉండదు. కిందటి నెల నేను పాడుకునేడిదుండే' అని తను చేసిన సహాయాన్ని గుర్తు చేశాడు భాస్కర్‌రెడ్డి. నెలకు వందకు పదిరూపాయల వడ్డీ ఇచ్చుకోవడానికి సిద్ధపడినా అప్పు పుట్టని రోజుల్లో ఈ చిట్‌ఫండ్‌తో ఆపదలో ఉన్నవాళ్లను అతడు ఆదుకుంటున్నాడు. అప్పుల్లో నిండామునిగినవాళ్లు ఆ స్కూల్లో తోటి ఉపాధ్యాయులు చాలామందే ఉన్నారు. చిట్టి పేరుతో పెట్టుబడి పెట్టి, డివిడెండ్ పేరుతో లాభాలు తీసుకొనే సార్లు కొందరు భాస్కర్‌రెడ్డికి తోడు. భాస్కర్‌రెడ్డి ఇంటి దగ్గర మరో మూడు చిట్టీలు నడుపుతాడు. ఆ అనుభవం తోడయింది. ఆదాయం మరింత అయింది.

భాస్కర్‌రెడ్డి తొమ్మిది పది తరగతులకు మేత్స్‌సార్. అతడికి ఇంటి దగ్గర నలభై మంది వరకు ట్యూషన్ విద్యార్థులు ఉన్నారు. ప్రభుత్వం ఇచ్చే జీతం కన్నా ఆ ట్యూషన్ ఆదాయం రెట్టింపు. అంతే కాదు చాలా మంచి సారు అని అతడి పట్ల విద్యార్థులలో భయభక్తులు రెండూ ఉన్నాయి.

అయినా ఈర్ష్యాద్వేషాలు తప్పవు కదా.

ఈ వేళ చిట్టీ పాట కోసం ఎదురుచూస్తున్న వాళ్లల్లో శేఖర్‌రెడ్డి, నర్సింహ, శ్రీనివాస చారి, రామ్మూర్తి, సంతోష్, ఉమాబాల అక్కడ ఉన్నారు.

చిట్టీ పాడుకోవడం కోసం ఎదురుచూస్తున్న వాళ్లల్లో రఘురాం అక్కడ కన్పించలేదు. మిత్తీ వ్యాపారులు రాకముందే జీతం తీసుకొని వెళ్లిపోయాడో ఏమో, లేక స్కూల్లోనే ఎక్కడన్నా ఉన్నాడో, చిట్టీ పాట మొదలయ్యే సరికల్లా ప్రత్యక్షమవుతాడోఏమో, లేక వేరేవాళ్లతో పాడించుకొని తాను తీసుకునే ఏర్పాటు చేసుకున్నాడో...

స్టాఫ్ రూంలోని గోడగడియారం స్టార్ట్ అన్నట్లుగా ఐదు గంటలు కొట్టింది.

చిట్టిపాట మొదలయింది

ఐదు వేలు - రామ్మూర్తి

ఆరువేలు - ఉమాబాల

ఆరువేల ఐదువందలు - శ్రీనివాసచారి

ఏడువేలు - సంతోష్

ఎనిమిదివేలు - నర్సింహ

తొమ్మిది వేలు - శేఖర్‌రెడ్డి

పదివేలు - ఉమాబాల

శేఖర్‌రెడ్డి ఎవరి ముఖం చూడకుండ, మోయలేని బరువు మోస్తూ ఆశగా భాస్కర్రెడ్డి ముఖంలోకి చూశాడు. భాస్కర్రెడ్డితో పాటే నాలుగేళ్ల కిందట ఉద్యోగంలో చేరిన శేఖర్‌రెడ్డి, అతనికి తెలియకుండానే జారుడుమెట్లమీద అడుగులు పడి కిందకి... ఇంకా కిందకి... జారిపోతున్నాడు. అప్పుల సంకెళ్లలో బందీ అయిపోయినట్టుగాను, ప్రపంచం ముందు తల వంచుకున్నట్టుగాను నిస్సహాయస్థితిలో దిక్కులేనివాడిలా చూస్తున్నాడు. ఎక్కడ ఏ తప్పు జరిగిందో అతనికే తెలియదు. క్లర్కు తన చేతిలో పెట్టిన జీతం మొత్తం గేటు బైటికి రాగానే మిత్తి వ్యాపారుల చేతుల్లోకి పోతున్నది. ఉద్యోగం కోసం డి.ఇ.ఓ ఆఫీసు సూపరింటెండెంట్ సహాయం తీసుకోవాల్సి వచ్చింది. ఈ ఉద్యోగం కోసం సహాయపడిన స్నేహితులు 'మొదటి నెల జీతం రాలేదనుకో' అని సలహా ఇచ్చారు. 'నిరుద్యోగిగా రెండేళ్ల ఉన్నవాడివి మరో నెల ఉద్యోగం లేనట్టు అనుకో.' అని బుద్ధి చెప్పారు. ఆ సూపరింటెండెంట్ చేసిన సహాయంతోనే శేఖర్‌రెడ్డికి ఉద్యోగం వచ్చింది. ఆ సహాయాన్ని అతడు జీవితాంతం మరచిపోలేడు.

తొలినెల జీతం తీసుకున్న వెంటనే పండ్లు, మిఠాయి కొనుక్కొని ఊరువెళ్లి అమ్మకీ నాన్నకీ ఇచ్చి గుడిలో పూజ చేసి వచ్చాడు. డి.ఇ.ఓ ఆఫీస్‌కి పోయి సూపరింటెండెంట్ పాదాలకు నమస్కారం చేశాడు. అక్కడికి రెండు మూడు నెలల తర్వాత శిరిడివెళ్లి సాయిబాబా దర్శనం చేసుకుని ద్వారకామాయిలో ధుని ముందు కూర్చుని సచ్చరిత్ర పారాయణం చేసి తిరిగి వచ్చి 'ఇది కొత్త జీవితం' అని ఊపిరి పీల్చుకున్నాడు.

ఉద్యోగంలో చేరిన నాలుగేళ్ల తర్వాత కూడా ఇవేళ జీవితం వైకుంఠ పాళిలో

పామునోట్లో పడి క్రింది మెట్టు మీద చతికిల పడినట్టుగానే ఉంది తప్ప తన బతుకులో మార్పులేదు.

నిజానికి లంచం ఏభైవేలు వరకు ఇచ్చుకోగలిగితే ఇంకా మంచి ఉద్యోగమే వచ్చేది. తన స్నేహితులకు అట్లా మంచి ఉద్యోగాలే వచ్చాయి.

భాస్కర్‌రెడ్డి సెల్ మోగడంతో స్టాఫ్‌రూమ్ నుంచి బైటపడి వరండాలోకి వచ్చాడు. చిట్టీపాటకి మధ్యలో చిన్న విరామమ్.

నర్సింహ చూపు ఉమాబాల మీద పడింది. ప్రాధేయపడుతున్నట్టుగా ఉందా చూపు. ఆ స్కూల్‌లో - బాల బాలికల హై స్కూల్ కావటంతో - గత అయిదారేళ్లల్లో విద్యార్థుల సంఖ్య అనూహ్యంగా పెరగడంతో - మూడేళ్ల క్రిందట కొత్తగా రిక్రూట్ చేసిన వాళ్లలో పదకొండుగురు - అప్పుడే, ఆ ఏడాదే ట్రయినింగ్ పూర్తి చేసుకున్న లేడీ టీచర్లే. కొందరు సెకండరీ గ్రేడ్ వాళ్లు. కొందరు బి.ఇడి వాళ్లు. అంతా పెళ్లి వయసువాళ్లే. వాళ్లందరిలో అందాల సుందరి ఉమాబాల. ప్రపంచ సుందరి మిస్ యూనివర్స్, మిస వర్ల్డ్‌లు ఆమె కాలిగోటికి సరిపోరు. ఎత్తయిన సన్నటి మనిషి. శ్వేతజాతి స్త్రీల శరీరఛాయ. శృంగారం తొణికిసలాడుతున్న పూర్ణ యౌవనం. చూపుల్లో పసివాళ్ల అమాయికత్వం. ముగ్ధ మోహనమైన స్నిగ్ధ రూపం. నవ్వితే నవరత్నాలు అంటారే అట్లాంటి నవ్వు.

నర్సింహకు ఉపాధ్యాయ వృత్తి బొత్తిగా ఇష్టం లేదు. బి.ఇడి అయితే చేశాడుగాని పబ్లిక్ సర్వీస్ కమీషన్ పరీక్షలు, బ్యాంక్ ఉద్యోగ ప్రయత్నాలు సాగిస్తూనే ఉన్నాడు. వాటిల్లో తనకు మంచి ఉద్యోగం వస్తుందని భరోసాతో ఉన్నాడు. అయితే ఇప్పుడు ఉమాబాలని చూట్టానికే ఈ ఉద్యోగం విడిచిపెట్టకూడదనుకుంటున్నాడు. ఆ మంచి ఉద్యోగాలు వచ్చినా అతడికి ఇప్పుడు చేరాలని లేదు.

ఏమో...

తన ఆరాధన ఆమెలో ప్రతిస్పందించక పోతుందా?

కాని ఆమె ఈ ప్రపంచాన్ని పట్టించుకునే మనిషిలా కనిపించదు. సరికదా తనకు శరీరం ఉన్న సోయికూడా ఆమెకు ఉండదు. పురాణ పాత్రలు, దేవకన్యలు గుర్తొస్తారు. ఈ పాఠశాలలోని మొత్తం పదిహేను వందల మంది పిల్లలుఅంతా తన పిల్లలాగానే ఉంటుందామె తీరు. ఆమె ఉపాధ్యాయ వృత్తికి ఆ మాతృత్వ శోభ మరింత అందాన్ని తెచ్చి పెట్టింది.

ఇ వేళ చిట్టీపాడు కుంటేనే తప్ప సాయంత్రం శేఖర్‌రెడ్డి ఇంటికి వెళ్లలేదు. శేఖర్‌రెడ్డి ఎన్నిసార్లు ఇల్లు మార్చిన ఆ కొత్త ఇంటి అడ్రసు ఎట్లా తెలుసుకుంటారో అప్పులిచ్చినవాళ్లు వచ్చిపడుతున్నారు. పెళ్లయిన తర్వాత కిందటి నెలే ఇల్లు మార్చాడు. అయినా అందరికి ఈ కొత్తఇల్లు తెలిసిపోయింది. ఈ చిట్‌ఫండ్‌తో సగం అప్పులు తీరిపోతాయి.

చిట్టిలో చేరిన మొదటి నెలనుండి శేఖర్‌రెడ్డి చిట్టిపాడుతునే ఉన్నాడు. రెండవ నెల పోటీపడ్డారు. లాటరీ బొమ్మా బొరుసులో తనకి రాలేదు. మూడోనెల శర్మగారికి పోయింది. నాలుగో నెల పద్ధతి ప్రకారం భాస్కర్‌రెడ్డి తీసుకున్నాడు. అయిదోనెల కొట్లాట జరిగింది. హిందీ సారు డ్రిల్లు సారు కొట్టుకున్నారు. చివరకు డ్రిల్లు సారుకిచ్చారు. తర్వాత నెల చిట్టిపాటరోజునే పెళ్లి చూపులకు వెళ్లాడు. ఏడోనెల 'అన్నా పెళ్లి చేసుకుంటున్న ఈ సహాయం చెయ్యి' అని భాస్కర్‌రెడ్డి చేతులు పట్టుకుని వేడుకున్నాడు. బాబూరావ్ ఇంటి స్థలం అగ్రిమెంటు రద్దయి పోతుందని చెప్పి వచ్చి తన పాదాలు పట్టుకున్నాడు.

ఏ అవసరంతో అయితే చిట్టి దందాలో చేరాడో ఆ అవసరం తీరలేదు సరి కదా పదకుండు మాసాలుగా తన డబ్బు దాదాపు ఇరవై వేలు చిట్టిలో ఇరుక్కుపోయింది. ఈ చిట్టిలో చేరక పోయిన ఇంత ఆపద వచ్చేది కాదు.

నర్సింహ ఇప్పుడు ఈనెల పోటీ. రఘురాం కన్పించలేదు. నర్సింహ చెల్లెలు పెళ్లి కుదిరింది. పెళ్లి కోసం డబ్బు కావాలి. రఘురామ్ భార్య ఆస్పత్రిలో ఉంది. గవర్నమెంట్ ఆస్పత్రే అయినా డబ్బు కావాలి. పదిహేను రోజులుగా రఘురామ్ మధ్య మధ్య సెలవు పెడుతూనే ఉన్నాడు. ముందు డాక్టర్లు తల్లి ప్రాణానికి ప్రమాదం అన్నారు. ఇప్పుడు ఆ ప్రమాదం తప్పి పోయింది. కూతురు పుట్టింది. నాలుగయిదు రోజుల్లో ఆమెని డిశ్చార్జ్ చేస్తారట.

తనకు ఈ చిట్టి చివరకు ఆఖరు ఇరువయ్యో నెల తప్ప ముందు రాదేమో అన్న భయం పట్టుకుంది శేఖర్‌రెడ్డికి. లేకుంటే పెళ్లికి ముందు రోజే శాలరీ డే పడింది. ఆ నెల తాను ఉంటానికి వీల్లేకపోయింది. చివరకు కాబూలీ అప్పు వందకు పది రూపాయలు వడ్డీకి ఇరువైవేలు అప్పుచేసి వెళ్లాడు పెళ్లికి. ఆ నెల తన తరఫున పాడమని దీక్షితులకు చెప్తే, ఆ నెల జగదీశ్‌కి అరెస్ట్‌వారెంటు వచ్చిందని భాస్కర్‌రెడ్డి అతడికి ఇచ్చేశాడు. కిందటి నెల కావాలనే అంజి రెడ్డికి ఇచ్చాడు. తన కళ్లల్లో కారం కొట్టినట్టయింది.

డి.ఇ.ఓ ఆఫీస్ సూపరింటెండెంట్ ఇక్బాల్ గుర్తుకొచ్చాడు. 'కుచ్ కామ్ హైతో జరూర్ ఆకే మిల్నా' అని ధైర్యం చెప్పాడు. కాని అంత పెద్దవాడి దగ్గరికి అప్పుకోసం వెళ్లాలన్నా భయమే. పబ్లిక్ సర్వీస్ కమిషన్‌లో పన్చేస్తున్న తన బంధువు స్వయంగా తనను తీసుకువెళ్తే మొదటిసారి ఇక్బాల్‌ని కలుసుకున్నాడు. దేవుడిలా ఆదుకున్న ఇక్బాల్ ఇప్పుడు పదే పదే గుర్తొస్తున్నాడు.

'పన్నెండువేల అయిదు వందలు' ఉమాబాల.

ఈ చిట్టిపాడి ఆ మొత్తం రఘురామ్‌కి ఇవ్వాలని ఉమాబాల ఉద్దేశం. రెండు రోజుల కిందట ఆమె ఆస్పత్రికి పోయి, రఘురామ్ భార్యని, బిడ్డనీ చూసి, రఘురామ్ చేతుల్లో రెండు వేల రూపాయలు పెట్టి వచ్చింది.

ఈ చిట్‌ఫండ్‌లో ఉమాబాల చేరినప్పుడు కూడా అమె తండ్రి వద్దు అనే అన్నాడు. చిట్టి దందాతో భాస్కరెడ్డి ఆ స్కూల్‌ల్లో కాబూలీ అప్పుల వాళ్లనుండి కాపాడుతున్నాడని, కష్టాల్లో ఉన్న టీచర్లను కాపాడు తున్నాడని నమ్మకం కలిగిన తర్వాతనే అమె చిట్టిలో చేరింది.

ఇప్పుడిప్పుడే ఈ దందా విశ్వరూపం అమెకు కన్పించి సాగింది.

ఆఫీస్‌లో క్లర్కులు అకౌంట్స్ చూసుకుంటున్నారు. హెడ్మాష్టరు ఎవరో విద్యార్థి తల్లితండ్రులు వచ్చి మాట్లాడుతుంటే - వాళ్ల బాధలు వింటున్నాడు. ప్లేగ్రౌండ్‌లో ఓ ప్రక్క వాలీబాల్, మరోవైపు శటిల్, ఇంకోవైపు బాల్ బాడ్మింటన్ పెద్ద తరగతి పిల్లలు ఆడుకుంటున్నారు. తోటమాలి పూల మొక్కలకు పైపుతో నీళ్లు పెడుతున్నాడు. స్కూల్ సమీపంలో ఏదో భవనంనుండి మైక్‌లో సినిమా పాటలు మారుమోగుతున్నాయి.

భాస్కర్‌రెడ్డి అడవిలో చిరుతపులిలా కన్పిస్తాడు. పెత్తనం, స్వాభిమానం, నిర్భయం ఆ ముఖంలో కన్పిస్తాయి. ఈ శాలరీ డే నాడు తప్పించి మిగిలిన రోజుల్లో అతడు ఎవరితోను పెద్దగా కల్పించుకోడు. తనపనేదో తనది. మధ్యాహ్నం సమయంలో ఆరేడుగురు స్నేహితులతో దగ్గర్లోనే ఉన్న శాంతమ్మ హోటల్‌కి పోయి సమోసాలో, కారాబిస్కెట్‌లో తిని టీ తాగి వస్తారు. వాళ్ల పద్ధతి ప్రకారం రోజుకొకరు చొప్పును బిల్లు చెల్లిస్తారు. అట్లాంటి సందర్భాల్లో కూడా భాస్కర్‌రెడ్డిదే పెద్దచేయి. ఇంకా పెళ్లి కాలేదు కదా. బ్రహ్మచారి కదా. నడవనీ పెళ్లయిన తర్వాతనే తెలుస్తుంది. అని ఛలోక్తులు విసురుతారు స్నేహితులు. ఆ ఛలోక్తులు విని ముసిముసి నవ్వుకుంటాడు అతడు.

'పదిహేను వేలు' అక్కడ ఆగిపోయింది చిట్టి పాట. నర్సింహ, శేఖర్‌రెడ్డి ఇద్దరూ పోటీ పడ్డారు.

బొమ్మ బొరుసు లాటరీ. నర్సింహ బొమ్మ.

రఘురామ్ భార్య అస్పత్రినుండి రావాలంటే ఈ చిట్టి కావాలి. ఇప్పుడు ఆ ఆశ పోయింది.

కుప్పకూలిపోయాడు శేఖర్‌రెడ్డి.

పెళ్లికాక పూర్వం ఈ అప్పుల వాళ్లను తప్పించుకోవడం కోసం రాత్రిళ్లు స్నేహితుల గదులకో, బంధువుల ఇళ్లకో పోయి పండుకునేవాడు. ఇప్పుడు ఆ పల్లెటూరి అమ్మాయి, అన్నపూర్ణ, కొండంత నమ్మకంతో వచ్చి తోడుగా తనతో బతుకుతున్నది. పెళ్లి ఇప్పుడప్పుడే వద్దు వద్దు అని ఎంత బతిమాలినా, ఎన్ని సాకులు చెప్పినా అమ్మ, నాన్న, బంధువులు... ఒప్పుకోలేదు. పెళ్లి చేశారు. తర్వాత ఆ అమ్మాయిని తీసుకుని వచ్చి వాళ్లే ఇక్కడ విడిచిపెట్టి వెళ్లారు. ఇప్పుడు ఇంటికి తప్పనిసరిగా వెళ్లాలి.

అతడికి ఏ దిక్కూ తోచలేదు.

* * *

అక్టోబర్ నెల. అర్ధరాత్రి దాటింది. అనుకోకుండా ఉరుములూ మెరుపులూతో వర్షం.

కోఠీ పార్కులో పండుకున్న ఇల్లు వాకిలీ లేని దిక్కులేని వాళ్లంతా... వాళ్లలో నలుగురయిదుగురు ఆడవాళ్లు, పసిపిల్లలతో ఉన్నవాళ్లు... గబగబా సర్దుకుని పేవ్‌మెంట్స్ వైపు పరుగు తీశారు.

అర్ధరాత్రి రెండు గంటల సమయం.

శేఖర్‌రెడ్డి రాత్రి పన్నెండు గంటల వరకు రోడ్లు తిరిగి, ఇంటికి వెళ్లడానికి భయపడి, స్నేహితుని గదికి వెళ్తే తాళం. ఆ తాళం చూసి దగ్గర్లో ఉన్న కోఠీ పార్కు చేరుకున్నాడు. ఈ పార్కులో ఇంతకు ముందు రెండు మూడు సార్లు పండుకున్నాడు శేఖర్‌రెడ్డి, ఇంటికి పోవడానికి వీల్లేక. అప్పుడు చింత లేదు. ఒంటరి వాడు. కాని ఇప్పుడు ఇంట్లో భార్య. ఒక్కతే ఎంత దిగులు పెట్టుకుంటుందో. అన్నం తినదు. నిద్ర ఉండదు. తెల్లవారు జామున ఇంటికి వెళ్తే అబద్ధం ఏం చెప్పాలో... ఎన్ని అబద్ధాలు చెప్పినా సరె... శాలరీ గురించి ఏం మాయ చెయ్యాలో తెలీకుండా ఉంది.

కోఠి పార్కునుండి ఆంధ్రా బ్యాంకు దాటుకుంటూ వచ్చి, కామత్ హోటల్‌వేపు పరుగుతీశాడు. వర్షంలో మొత్తం తడిచిపోయాడు. అక్కడే పేవ్‌మెంట్ మీద బిచ్చగాళ్లు, కుష్టు రోగులూ, దిక్కులేని వృద్ధులూ, పిల్లలూ గోనెపట్టాలు, న్యూస్‌పేపర్లు పరుచుకుని పండుకుని ఉన్నారు. పండుకోవటానికి కాదు కూర్చోవటానికి సైతం ఎక్కడా చోటు కన్పించక చివరకు ఓ షాప్ షట్టర్ దగ్గర మెట్టు మీద కూర్చున్నాడు శేఖర్‌రెడ్డి. తనకు ఎదురుగా పది గజాల దూరంలో పిల్లర్‌కి అనుకొని సిగరెట్ తాగుతూ... రఘురామ్. సిగరెట్... స్ట్రీట్‌లైట్ వెల్తురులో ఆ ముఖం గుర్తుపట్టాడు శేఖర్‌రెడ్డి.

వెంటనే అక్కడనుండి లేచి పోయాడు శేఖర్‌రెడ్డి. రఘురామ్ తనని చూడలేదు. గుర్తుపట్టలేదు. పేవ్‌మెంట్ రెండో చివరకు నడిచాడు. అక్కణ్నించి ఎక్కడికి పోవాలో తెలీదు. రఘురామ్ సిగరెట్ వెలుతురు కన్పిస్తున్నది.

వాన తగ్గకుండా కురుస్తున్నది.

శేఖర్‌రెడ్డి కళ్లల్లోంచి వర్షం కురువ సాగింది.

*

'వార్త' ఆదివారం అనుబంధం